క్లుప్తంగా

భూమనను కలిసిన పార్టీ నాయకులు


భూమనతో నాయకులు

సదుం: వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డిని తిరుపతిలో మండలానికి చెందిన పార్టీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తున్న వైనాన్ని ప్రజల్లో ఎండగట్టాలని వారికి భూమన సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన వారిలో వారిలో ప్రకాష్ రెడ్డి, యాదవేంద్రరెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ

గంగవరం: 2024–25కి సంబంధించి ఆర్‌జిఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధ, గురువారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకూ నిర్వహించే శిక్షణా తరగతులకు మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

పోలీసులకు స్మార్ట్ లాక్‌లు పంపిణీ


స్మార్ట్ లాక్‌లు చూపుతున్న ఎస్‌ఐ, పోలీసులు

గుడుపల్లె: స్థానిక పోలీసు స్టేషన్ పోలీసులకు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం స్మార్ట్ లాక్‌లను పంపిణీ చేశారు. ఇళ్లలో దొంగతనాలకు చెక్ పెట్టే దిశగా ప్రజలు ఈ లాక్‌లను ఇంటి ముందు ఉన్న డోర్‌కు అమర్చుకోవాలన్నారు.. డోర్ వద్ద వచ్చి తలుపులు తీసే లోపు ఈ లాకర్ల వల్ల దొంగలు దొరికిపోతారని పేర్కొన్నారు. గ్రామాలలో కూడా ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఈ స్మార్ట్ లాకర్లు వాడుకుంటే భద్రత ఉంటుందన్నారు.

పాఠశాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎంఈఓ రాజారాం

కుప్పం రూరల్: మండలంలోని అడవి బూదుగూరు ప్రాథమిక పాఠశాలను కుప్పం ఎంఈఓ–2 రాజారాం సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఈవీఎస్ పరీక్షల నిర్వహణ, తరగతుల వారీగా విద్యార్థుల స్థాయి, మరుగుదొడ్ల నిర్వహణ, అపార్, వర్క్‌బుక్, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థుల స్థాయిని పెంచేందుకు, పాఠశాల నిర్వహణ విషయంగా టీచర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, ఉపాధ్యాయులు విజయేంద్రరాజు, నరేంద్రబాబు పాల్గొన్నారు.

భోగనంజుండేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న భోగనంజుండేశ్వరస్వామి

పుంగనూరు: ఆరుద్ర నక్షత్రం పర్వదినం సందర్భంగా పట్టణంలోని బస్టాండులో వద్ద ఉన్న శ్రీ భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టీంకు హుజైఫా


హుజైఫానుతో నవీన్‌కుమార్

పలమనేరు: పట్టణానికి చెందిన పలమనేరు ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారుడు హుజైఫా సౌత్‌జోన్ జట్టుకు ఎంపికై నట్టు స్థానిక ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు నవీన్ కుమార్ తెలిపారు. కోచ్, డిగ్రీ కళాశాల పీడీ విక్రమ్‌రాజ్ మాట్లాడుతూ ఇటీవల కుప్పం ద్రవిడ యూనివర్సిటీలో జరిగిన ఎంపికలో ఇతను జేఎన్‌టీయూకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈనెల 21న కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు.

పదేళ్లుగా ప్రదక్షిణలు

సోమల మండలం పొదలకుంట్లపల్లెకు చెందిన రామక్రిష్ణారెడ్డి తన సాగులోని భూమిని వేరేవారికి పట్టా ఇచ్చారని 2014లో ఆర్‌ఓఆర్ అప్పీల్‌ను మదనపల్లె ఆర్డీఓ కోర్టులో వేశారు. ఇప్పుడు వీరి మండలం పలమనేరు ఆర్డీఓ కోర్టు పరిధిలోకి రావడంతో ఆయన ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటివరకూ తన కేసుకు సంబంధించి నోటీసు కూడా రాలేదని, పదేళ్లుగా కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.


పదేళ్లుగా తిరుగుతున్న రామక్రిష్ణారెడ్డి

సచ్చినాకైనా తీరుస్తారా?

గంగవరం మండలం గండ్రాజుపల్లెకు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు చెంగమ్మ సైతం వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా ఆర్డీఓ కార్యాలయానికి వచ్చింది. ఆమెను సాక్షి పలకరించేసరికి తన ఆక్రోశం వెళ్లగక్కింది. 'ఏమని అడిగితే.. ఎవరికి చెప్పి ఏమి ప్రయోజనం నాయనా?.. నేను సచ్చినాకైనా సమస్య తీరుతుందో లేదోనని తన గోడు చెప్పుకొచ్చింది.


ఆర్డీఓ కార్యాలయానికి వస్తున్న వృద్ధురాలు చెంగమ్మ

ఎన్నేళ్లకు పరిష్కరిస్తారో..

పలమనేరుకు చెందిన విశ్రాంత టీచర్ పుష్పరాజ్ పొలంలో కొంత ఎక్స్‌ప్రెస్ హైవేకు తీసుకుని నష్ట పరిహారం ఇచ్చారు. మిగిలిన పది సెంట్లను స్థానిక రెవెన్యూ అధికారులు పక్కభూమి వారికి ఆన్‌లైన్‌లోకి ఎక్కించేశారు. దీంతో ఆయన నిత్యం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ పెండింగ్ కేసుల సమస్య కేవలం వీరిదే కాదు.. ఇలాంటి వారు డివిజన్‌లో వెయ్యి మందికి పైగానే ఉన్నారు! మండల స్థాయిలో అధికారులు, సిబ్బంది చేసే తప్పిదాల మూలాన వీరంతా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఈ కేసులు ఎన్నేళ్లకు పరిష్కరిస్తారో ఆ పైవాడికే ఎరుక అన్నట్లు పరిస్థితి ఉంటోంది.

పేరుకుపోతున్న ఆర్‌ఓఆర్ కేసులు!

- పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో వెయ్యి ఫైళిలుకు పెండింగ్
- 2014 నుంచి కోర్టు చుట్టూ కక్షిదారుల ప్రదక్షిణలు
- మండలాల నుంచి ఆలస్యమవుతున్న పారావైజ్ రిమార్క్స్
- కేసుల విషయంలో గడువు తీసుకుని లాగుతున్న న్యాయవాదులు
- తిరిగి తిరిగి వేసారుతున్న బాధిత రైతులు




పలమనేరు సబ్ డివిజన్ మండలాల మ్యాప్, పలమనేరు ఆర్డీఓ కార్యాలయం

పలమనేరు: మండల స్థాయిలో వీఆర్వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే ఒకరి భూమికి మరొకరికి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. దీంతో వేరేవారి పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుంటున్నారు. గతంలో రీసర్వేలో సర్వే చేసిన వారు చేసిన తప్పిదాల కారణంగా వేలాదిమంది రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరికి ఉన్నభూమి కంటే తక్కువగానూ, మరికొందరికి ఎక్కువగానూ రికార్డుల్లో నమోదు చేశారు. ఇలాంటి కేసులకు అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కారణమవుతోంది. ఈ సమస్యలు ఆర్డీఓ కార్యాలయాలకు కేసులుగా మారి చేరుతున్నాయి. కేవలం పలమనేరు ఆర్డీఓ కార్యాలయ పరిధిలోనే ఆర్‌ఓఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్–ఆర్‌ఓఆర్ 1బి) కేసులు వెయ్యికి పైగా ఉన్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రతి శనివారం ఆర్డీఓ కోర్టు నిర్వహిస్తున్నప్పటికీ...

ఇక్కడి ఆర్డీఓ కార్యాలయంలో ప్రతి శనివారం ఆర్‌ఓఆర్ అప్పీళ్లపై న్యాయవాదుల ద్వారా కేసులు విచారణ చేస్తున్నారు. అయితే దీనికి సంబంధించి ఆయా మండలాల తహసీల్దార్ల నుంచి పారావైజ్ రిమార్కులు ఆలస్యంగా అందడం ఓ కారణమవుతోంది. దీనికి తోడు కక్షిదారుల న్యాయవాదులు రిటర్న్ స్టేట్‌మెంట్ల కోసం గడువు తీసుకోవడం, వారికి ఇతర కోర్టుల్లో కేసుల బిజీ కారణంగా చోటు చేసుకుంటున్న కాలయాపన మూలాన దీర్ఘకాలం కేసులు సా..గు..తు..న్నా..యి..! గతంలో కేసులు వేసిన తమ తండ్రులు మృతి చెందడంతో ఇప్పుడా కేసులకు వారసులుగా వారి సంతానం కోర్టులకు వస్తున్నారంటే కేసుల విచారణలో కొనసాగుతున్న జాప్యం ఎంతగా ఉందో ఇట్టే బోధపడుతుంది.


ఆర్‌ఓఆర్ కేసులకు హాజరైన కక్షిదారులు

2022 నుంచి పలమనేరులో ఆర్డీఓ సేవలు

గతంలో పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజక వర్గాలు మదనపల్లె సబ్ డివిజన్‌లో ఉండేవి. బంగారుపాళెం చిత్తూరు డివిజన్‌లో ఉండేది. 2022లో బంగారుపాళెంతోపాటు పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని మండలాలతో పలమనేరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. కుప్పం నియోజకవర్గంలోని మండలాలకు కుప్పాన్ని డివిజన్ చేశారు. దీంతో మదనపల్లెలోని ఆర్‌ఓఆర్ కేసుల కుప్పం, పలమనేరు ఆర్డీఓ కోర్టులకు చేరాయి. డివిజన్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ పలమనేరు ఆర్డీఓలుగా 9మంది పనిచేశారు.

పెండింగ్ కేసులో చొరవ చూపుతాం

పెండింగ్ కేసుల విషయంగా స్థానిక ఆర్డీఓ భవానిని వివరణ కోరగా.. మదనపల్లె సబ్ డివిజన్‌లోని పెండింగ్ కేసులే ఇక్కడికి 600 దాకా వచ్చాయి. ఇక్కడ మరో 400 దాకా ఇటీవల వచ్చాయి. ఈ కేసుల పరిష్కారం కోసం ఓ ప్లాన్‌గా ప్రతి శనివారం కేసులు నిర్వహిస్తున్నాం. కేసులు అంత త్వరగా పరిష్కారం కావు. ఎందుకంటే దానికి సంబంధించిన వ్యవహారం అలా ఉంది. ఆయా మండలాల తహసీల్దార్లతో సమీక్షించి, పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపుతాం.

వీఆర్వోలు, సర్వేయర్ల తప్పిదాల వల్లే రెవెన్యూ సమస్యలు

- జిల్లాలోనే ఎక్కువ సమస్యలు ఇక్కడే
- సదస్సుల్లో ఇప్పటికి 1,733 అర్జీలొచ్చాయ్
- ఆర్‌ఓఆర్ పెండింగ్ కేసులపై చర్యలు తీసుకుంటాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో పలమనేరు ఆర్డీఓ భవాని

సాక్షి ఇంటర్వ్యూ


రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న పలమనేరు ఆర్డీఓ భవాని

పలమనేరు: జిల్లాలోనే పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు వస్తున్నాయి. వీటిలో చాలావరకు మండలాల స్థాయిలోనే పరిష్కరించొచ్చు. కానీ అన్నీ ఇక్కడికి చేరి సమస్యల పరిష్కారానికి ఆలస్యమవుతోందని పలమనేరు ఆర్డీఓ భవాని చెప్పారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో ఆమె 'సాక్షి'కిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

సాక్షి: రెవెన్యూ సమస్యలు ఇంత ఎక్కువగా రావడానికి కారణం ?

ఆర్డీఓ: క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు ఎప్పటికప్పుడు పటిష్టంగా రెవెన్యూ సమస్యలపై దృష్టి పెడితే సమస్యలు రావు. కొన్ని అక్కడ జరిగిన పొరబాట్ల కారణంగా అవి అప్పీల్ కేసులుగా మారి ఇక్కడికి వస్తున్నాయి. రీ–సర్వేలో విస్తీర్ణాల్లో వ్యత్యాసాలు, అనుభవం ఒకరికుంటే పాసుపుస్తకాలు మరొకరికి, ఆన్‌లైన్‌లో ఎక్కించడాలు లాంటి సమస్యలే ఎక్కువ.

సాక్షి: రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల పరిస్థితేమిటి?

ఆర్డీఓ: జిల్లాలోనే ఎక్కువగా ఈ డివిజన్‌లో ఇప్పటివరకూ 1,733 అర్జీలందాయి. వీటిలో పెద్దపంజాణీ, బైరెడ్డిపల్లె, సోమల మండలాల్లో ఎక్కువగా, పలమనేరు, వీ.కోట మండలాల్లో తక్కువగా ఉన్నా యి. వీటిని ఆయా మండలాల తహసీల్దార్లతో సమీక్షించి పరిష్కరించేలా యాక్షన్ ప్లాన్ చేస్తున్నాం.

సాక్షి: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వాటిపై మీ ఫోకస్ ఏమిటి?

ఆర్డీఓ: 2014నుంచి ఇప్పటివరకూ డివిజన్‌కు సంబంధించి వెయ్యి ఆర్‌ఓఆర్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి కారణం ఆయా కక్షిదారుల న్యాయవాదులు కేసుల్లో సమయం తీసుకోవడం తదితర సమస్యలున్నాయి. అప్పటికీ ప్రతి శనివారం సగటున 20 కేసుల వరకూ హియరింగ్‌కి పెట్టుకుంటున్నాం.

సాక్షి: పెండింగ్ కేసుల పరిష్కారానికి ఏదైనా ప్లాన్ ఉందా?

ఆర్డీఓ: ఈ నెలాఖరుకు రెవెన్యూ సదస్సులు ముగుస్తాయి. వచ్చిన అర్జీలపై డివిజన్‌లోని తహసీల్దార్లతో సమీక్షిస్తాను. ప్రతి నెలా టార్గెట్ ఇచ్చి వాటి పరిష్కారానికి కృషిచేస్తాం. ప్రజలు భూవివాదాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఓ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు లేకుండా వస్తుంటారు. రెవెన్యూ సమస్యల్లో ప్రధానమైంది డాక్యుమెంట్లు, ఆపై అనుభవం అని గమనించాలి.

గ్రామాల అభివృద్ధికే ప్రాముఖ్యత


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామాలు రాష్ట్రానికి పట్టుకొమ్మలాంటివని, గ్రామస్థాయి నుంచి అభివృద్ధి జరిగితే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని దుర్గామాత ఆలయ కమిటీ భవనంలో గ్రామాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. స్థిరమైన గ్రామాభివృద్ధి జరిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధిలో ముందజులో ఉంటుందన్నారు. పరిసరాల శుభ్రతపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలు నివేదించిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలన్నారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ యువరాజు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


హాజరైన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

గ్రామాల అభివృద్ధికి సమన్వయ కృషి

సదుం: గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల సహకారం, సమన్వయ కృషి అవసరమని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు హరిబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ స్వరాజ్య అభియాన్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాలలో చేయవలసిన అభివృద్ధి గురించి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ఏపీఓ శ్రీనివాసులు, ఏపీఎం హరిప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఉదయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ హరిబాబు



వామ్మో.. చలి..

వి.కోట: మండలంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడడం లేదు. సాయంత్రం తిరిగి చలిపులి విజృంభిస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు..ఇలా అన్ని వయస్కుల వారూ ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పొగమంచుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఆస్తమా, కోరింత దగ్గు, చర్మవ్యాధులు, జలుబు మొదలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వీటి బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

చౌడేపల్లె: మండలంలోని బత్తలాపురం సమీపంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. రహస్య సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేయగా ఎనిమిది జూదరులు పట్టుబడ్డారని, వారి నుంచి రూ16,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఇదలా ఉంచితే, పట్టుబడిన వారి నుంచి సెల్‌ఫోన్లు, బైక్‌లు సీజ్ చేయకుండా వదిలేయడంతో పోలీసుల తీరుపై పలు ఆరోపణలు వచ్చాయి.

విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది

పుంగనూరు: పట్టణంలో విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ పట్టణ డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా స్థానిక కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఈ ర్యాలీ చేశారు. ఈఈ మాట్లాడుతూ, నిరంతర విద్యుత్ పొదుపు భావితరాలకు మలుపు అన్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం అందరూ బాధ్యతగా గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

బసివినాయునిపల్లెలో శ్రీరామకోటి

పుంగనూరు: ధనుర్మాసం సందర్భంగా మండలంలో బసివినాయునిపల్లెలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం రామకోటి భజనతో మార్మోగింది. సోమవారం గ్రామస్తులు శ్రీరామకోటిని భక్తిపూర్వకంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, పూజలు చేశారు. శ్రీరామకోటి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

22న విభిన్న ప్రతిభావంతులకు పరికరాల గుర్తింపు శిబిరం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఈనెల 22న కృత్రిమ అవయవాల తయారీ సంస్థ కాన్పూర్ సౌజన్యంతో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈఓ లీలారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన వారికి చేతికర్రలు, వాకర్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, అంధులకు చేతివాచ్, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్ మొదలైన వాటిని ఇవ్వనున్నట్టు వెల్లడించారు. దీనికి హాజరయ్యే వారు రేషన్ కార్డు, ఆధార్, సదరం సర్టిఫికెట్, వికలత్వం తెలిపే ఫొటోలు, ఫోన్ నంబర్లు, రెండు సెట్ల జెరాక్స్‌లు తీసుకురావాలని తెలియజేశారు.

అర్జీల పరిష్కారానికి కృషి


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీల విషయంలో ఆర్థిక పరమైన సమస్యలు మినహా మిగిలిన వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికపరమైన సమస్యలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని.. మిగిలిన వ్యక్తిగత, ప్రజా సమస్యలు మున్సిపల్ పరిధిలో పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు వచ్చే అవకాశం ఉందని, ఆయన దృష్టికి అర్జీలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ పరిధిలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా పరిష్కార దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణపై ఉద్యోగులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విషయంపై మున్సిపల్ పరిధిలోని సచివాలయం, పురపాలక సిబ్బంది శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దాము, సోము, సురేష్, జగదీష్, శివ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నేడు 'ఏకలవ్య కాలనీ..' ఆవిష్కరణ

పలమనేరు: ప్రముఖ రచయిత పలమనేరు బాలాజి రచించిన 'ఏకలవ్య కాలనీ.. ఎరుకల జీవనగాథలు' పుస్తకావిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లోని సాధి బుక్‌స్టాల్ వద్ద చేయనున్నట్టు పుస్తక రచయిత ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కామన్‌వెల్త్ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన రాగాల వెంకట రాహుల్, సాహితీవేత్త వేణుగోపాల్ దీన్ని ఆవిష్కరించి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డికి తొలి సంపుటిని అందజేస్తారని తెలిపారు. ఇందులో ఎరుకల కులస్తుల జీవితాలను కళ్లకు కట్టినట్టు చిత్రించినట్లు పేర్కొన్నారు.



ఏకలవ్య కాలనీ కథా సంపుటి

దొంగతనాలు అరికట్టాలి

–పోలీసులతో డీఎస్పీ ప్రభాకర్

సదుం: గ్రామాలలో దొంగతనాలు జరగకుండా పోలీసులు గస్తీ కాయాలని డీఎస్పీ ప్రభాకర్ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విజబుల్ పోలీసింగ్ పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి కానిస్టేబుల్ తనకు కేటాయించిన గ్రామాల పరిధిలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఒక సీసీ కెమెరా 50 మంది పోలీసు సిబ్బందితో సమానమన్నారు. స్మార్ట్ లాక్ ఉపయోగాలపై అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల నియంత్రణకు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీఐ రాంభూపాల్, ఎస్‌ఐ షేక్‌షావలి పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్